

క్షీరారామలింగేశ్వరుడి సేవలో..

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామిని ప్రభుత్వ చీఫ్ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులు దర్శించుకున్నారు.



లక్ష తులసి పూజ

వీరవాసరం: రాయకుదురులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణదేవరాయ కాపు తెలగ సంఘం ఆధ్వర్యంలో గురువారం లక్ష తులసి పూజ నిర్వహించారు.

స్పోర్ట్స్ మేనేజర్‌గా కరుణానిధి



దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి కరుణానిధిని జెఎన్‌టీయూ (కాకినాడ) రిజిస్ట్రార్ స్పోర్ట్స్ మేనేజర్‌గా నియమించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

రెడ్‌క్రాస్‌కి రూ.1.67 లక్షల విరాళం



కలెక్టర్ చేతుల మీదుగా విరాళం అందచేస్తున్న డ్వామా సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది రెడ్‌క్రాస్ సంస్థకు రూ. 1.67 లక్షల విరాళం అందచేశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరవు సిబ్బందితో కలిసి కలెక్టర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ ఛైర్మన్ బద్రిరాజుకు అందచేశారు. ఈ సందర్భంగా ఎక్కువ విరాళాలు సేకరించిన డ్వామా ఏపీడీ వి.విజయలక్ష్మి, ఈసీ కె.శ్రీనివాస్, ఎఫ్ఎ యుగ లక్ష్మి, కాళ్ల, భీమవరం, తాడేపల్లి గూడెం, అత్తిలి మండలాల సిబ్బందిని అభినందిస్తూ వారికి మొక్కలను బహుకరించారు.

శ్రీవారి క్షేత్రంలో 14 నుంచి సంక్రాంతి సంబరాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఈ నెల 14 నుంచి 16 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆలయ తూర్పు రాజగోపురం వైపు ఖాళీ ప్రదేశంలో కోలాట నృత్యాలు, భజనలు, హరిదాసుల సందడితో పాటు, పలు వేషధారణలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 16న సాయంత్రం స్వామివారి కనుమ ఉత్సవాన్ని దొరసానిపాడులో వైభవంగా జరుపుతామని, ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫిబ్రవరి నెలలో స్కిల్ హబ్‌ను ప్రారంభిస్తున్నామని నిర్వాహకులు వరప్రసాద్ గురువారం చెప్పారు. అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌కు 3 నెలల శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ(కామర్స్ బ్యాక్ గ్రౌండ్) అర్హతగా నిర్ణయించామన్నారు. కంప్యూటర్ ఆపరేటర్‌కు 3 నెలల శిక్షణ అందిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ అర్హత ఉండాలన్నారు. రెండు కోర్సులకు 18–30 సంవత్సరాలు వయస్సు ఉండాలన్నారు. ప్రతీ బ్యాచ్‌కు 30 మందికి అవకాశం ఉందన్నారు. శిక్షణా కాలంలో స్టైఫండ్ అందిస్తామని తెలిపారు. అనంతరం ఏలూరు, విజయవాడ, హైదరాబాద్‌లో ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు.

రోడ్డుపై గొర్రెను నరికిన వ్యక్తుల అరెస్టు

తణుకు: బాలకృష్ణ వీరసింహారెడ్డి సినిమా విడుదల నేపథ్యంలో కొందరు వ్యక్తులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్డుపై గొర్రెపోతును నరికి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు తణుకు సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. తణుకు పట్టణంలోని లక్ష్మీ థియేటర్ ఎదుట గురువారం ఉదయం టీడీపీ సానుభూతిపరులు మట్టా వెంకట్, నల్లూరి సురేష్, వల్లూరి సురేంద్రనాథ్, షేక్ ఆరిఫ్, నందమూరి కేశవ, హర్ష, బట్టపల్లి నాగరాజు, పోలాటి రవికృష్ణ, గెడ్డం శ్రీను మరికొంత మంది కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

చెస్ పోటీలు మేధో శక్తిని పెంచుతాయి

ఏలూరు (టూటౌన్): చెస్ పోటీలు విద్యార్థుల్లో మేధోశక్తిని పెంచుతాయని జిల్లా ప్రభుత్వాసుపత్రి సమన్వయ అధికారి(ఆర్ఎంఓ) డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస్ అన్నారు. డీవైఎఫ్ఐ సంక్రాంతి సంబరాలలో భాగంగా ఏలూరులో జరగుతున్న జిల్లా స్థాయి చెస్ పోటీలు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం సభలో ఆర్ఎంఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐద్వా నగర కార్యదర్శి పి.వెంకటరమణ మాట్లాడుతూ యువత పండుగ సమయంలో చెడు వ్యసనాలకు జోలికి పోకుండా ఈ ఆటల పోటీలు ఉపయోగపడుతున్నాయన్నారు. ఓపెన్ టోర్నమెంట్‌లో జిల్లా చాంపియన్‌గా వైఎస్ సూర్యానారాయణ నిలిచారు. విజేతలుగా కె.ఓంకార్, జి.హర్షవర్ధన్, సీహెచ్ వివేక్, వై.ప్రేమి రక్షిత, బెస్ట్ ఉమెన్ ప్లేయర్స్‌గా జి.హాదర్స్ అరుణ, కె.కృష్ణకుమారి అండర్ 7 పోటీల్లో వై.జ్యోతి స్వరూప్ గోల్డ్‌మెడల్ సాధించారు. అండర్ 9 పోటీల్లో జి.అబ్రహం, పి.బాబ్లి బాల విజేతలుగా నిలిచారు. అండర్ 13 విభాగంలో పి.ఉదయ్, బి.తన్మయి, అండర్ 15 విజేతలుగా కె.త్రిషాంక్ కోటి, ఎల్.రోషిణి నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను నిర్వాహకులు అభినందించారు.

వచ్చే ఏడాది కల్లా.. ఫిషరీస్ వర్సిటీ

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పశ్చిమ గోదావరి జిల్లాలో ఫిషరీస్ యూనివర్సిటీకి సీఎం జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన నెలన్నర లోపే వర్సిటీ పనులు ఊపందుకున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభించేందుకు వర్సిటీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. శాశ్వత భవనాలు పూర్తయ్యేలోపు అద్దె భవనాల్లో కోర్సులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

- సరిపల్లిలో పాలనా భవన నిర్మాణ పనులు ప్రారంభం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి కోర్సులు
- రాష్ట్రంలో తొలి ఫిషరీష్ యూనివర్సిటీగా గుర్తింపు



నరసాపురం మండలం సరిపల్లిలో యూనివర్సిటీ పరిపాలనా భవన నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

నరసాపురం: నరసాపురంలో ఫిషరీష్ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. నరసాపురం మండలం సరిపల్లి, లికితపూడి మధ్య యూనివర్సిటీకి సంబంధించి పరిపాలనా భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. 6 నెలల్లో యూనివర్సిటీకి సంబంధించిన పరిపాలనా భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధికారులను ఆదేశించారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభించడానికి యూనివర్సిటీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పరిపాలనా భవనం పనులు పూర్తికావడానికి ముందుగా తాత్కాలికంగా అద్దె భవనం నుంచి పాలనా వ్యవహారాలు నడపాలని నిర్ణయించారు. ఇప్పటికే యూనివర్సిటీకి సంబంధించి ప్రత్యేక అధికారిగా ప్రొఫెసర్ ఓగిరాల సుధాకర్‌ను ప్రభుత్వం నియమించింది. అద్దె భవనాల పరిశీలన కూడా పూర్తయ్యింది. రాబోయో విద్యా సంవవత్సరం నుంచి కోర్సుల నిర్వహణ సాగించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు యూనివర్సిటీ ప్రత్యేక అధికారి ఓగిరాల సుధాకర్ చెప్పారు.

మత్స్య ఉత్పత్తులకు ప్రోత్సాహం లేక

మత్స్య సంపద, ఆక్వా ఎగుమతుల్లో జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. డెల్టా ప్రాంతం నుంచి దేశ, విదేశాలకు భారీగా ఆక్వా ఎగుమతులు జరుగతుంటాయి. ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆక్వా పుణ్యమా అని జిల్లాకు వస్తోంది. ఇటు తీర ప్రాంతంలో సముద్ర మత్స్యసంపదతో భారీగా ఆదాయం సమకూరుతుంది. ఈ రంగం విషయంలో గత ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో ఆదాయం పూర్తిస్థాయిలో రావడంలేదు. ముఖ్యంగా ఆక్వా రంగంలో నిపుణుల కొరత కారణంగా కొత్త ప్రయోగాలు చేయలేకపోవడం, వైరస్‌ల బారిన పడకుండా నష్టాలు లేకుండా ఆక్వాసాగు చేయడం లాంటి ప్రయోజనాలు కోల్పోతున్నారు. ఆక్వా రంగంలో నిపుణుల కొరతతో రాష్ట్రంలో ఏటా రూ.25 వేల కోట్ల అదనపు ఆదాయం కోల్పోతున్నామని అంచనా.

మత్స్య ఉత్పత్తులు పెరుగుతాయి



ఆక్వా, మత్స్య రంగాల్లో నూతన విప్లవం ఇది. ఆక్వా రంగానికి ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రోత్సాహం చాలా అవసరం. ఆక్వారంగ నిపుణుల్ని తయారు చేసుకుని, సాగులో నైపుణ్యాలను పెంచుకుంటే ఆక్వాసాగులో నష్టాలు తగ్గుతాయి. ప్రభుత్వం జిల్లాలో ఆక్వా, మత్స్య రంగాలను ఎలా అభివృద్ధి చేయాలని పరితపిస్తోంది. అందుకే బియ్యపుతిప్పలో హార్బర్ కూడా కడుతున్నాం. ఆక్వా యూనివర్సిటీ పనులు ప్రారంభమయ్యాయి. రాబోయే విద్యాసంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభమవుతాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

శంకుస్థాపన చేసిన 45 రోజుల్లోనే పనులు ప్రారంభం



యూనివర్సిటీ పరిపాలనా భవన నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

45 రోజుల క్రితం నవంబర్ 21న సుమారు రూ.600 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఫిషరీష్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం శరవేగంగా పనులు ప్రారంభించారు. సుమారు 500 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా రూ.100 కోట్లు కేటాయించింది. ఇక పరిపాలనా పరిపలనా భవనం నిర్మాణానికి రూ.40 కోట్లు గత ఏడాది బడ్జెట్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పనులు వేగంగా మొదలు పెట్టారు.

రాష్ట్రంలో తొలి యూనివర్సిటీ

రాష్ట్రంలో ఇది తొలి మత్స్య విశ్వవిద్యాలయం. దేశంలో మూడోది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో నరసాపురంలో 19 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం ఉంది. ఏటా తీరంలో రూ.300 కోట్ల విలువచేసే మత్స్య ఎగుమతులు సాగుతాయి. హార్బర్ ఉంటే మరో 40 శాతం ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం సర్కార్ ఆక్వా రంగంలో సవాళ్లను ఎదుర్కోవాలనే లక్ష్యంతోనే ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు ఉపక్రమించింది. ఈ యూనివర్సిటీ ఏర్పాటు కారణంగా 90 వేల మంది ఆక్వా రైతులు, పరోక్షంగా 8 లక్షల మంది ప్రజలు లబ్ధిపొందుతారని అంచనా.

అన్ని మత్స్య కళాశాలలు ఈ యూనివర్సిటీ పరిధిలోకే..

ప్రస్తుతం రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ముత్తుకూరిలోని మత్స్య కళాశాల, కృష్ణాజిల్లా భావదేవనపల్లి మత్స్య కళాశాల, తూర్పుగోదావరిజిల్లా భలబద్రపురం, కాకినాడ మత్స్య కళాశాలలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, ఉండి ప్రాంతాల్లో ఉన్న మత్స్య పరిశోధనా కేంద్రాలు నరసాపురంలో ఏర్పాటు చేయబోతున్న ఫిషరీష్ యూనివర్సిటీ పరిధిలోకి వస్తాయి. ఇక్కడ బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీష్ అండ్ సైన్స్, మాస్టర్ ఆఫ్ ఫిషరీష్ అండ్ సైన్స్ వంటి కోర్సులు, ఫిషరీష్ విభాగంలో పీహెచ్‌డీ కోర్సులు అందిస్తారు. రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తులు పెంచడానికి అవసరమైన ప్రయోగాలు సాగుతాయి. యూనివర్సిటీకి సంబంధించి పరిపాలనా భవనాన్ని, తరగతి భవనాలు, హాస్టల్స్ భవనాలు సరిపల్లిలో, ల్యాబ్‌లు, ఇతర భవనాలు తీర గ్రామాలైన పీఎంలంక, బియ్యపుతిప్ప మధ్య నిర్మించనున్నారు.

నేటి నుంచి మావుళ్లమ్మ ఉత్సవాలు



మావుళ్లమ్మ అమ్మవారు (ఫైల్)



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ వారి 59వ వార్షిక మహోత్సవాలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటలకు కలశ స్థాపన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అమ్మవారికి విశేష పూజ గ్రామోత్సవం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభిస్తారు. అమ్మవారికి ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణచే ఉత్సవం ప్రారంభమవుతుంది. సాయంత్రం 5 గంటలకు హరికథ, రాత్రి 8 గంటలకు శ్రీసాయికళా స్రవంతి వనస్థలిపురం హైదరాబాద్ వారిచే గణపతి మహత్యం నాటకం ఏర్పాటు చేసినట్లు నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ తెలిపింది.

జాతర ఏర్పాట్ల పరిశీలన

నేటి నుంచి ప్రారంభం కానున్న శ్రీ మావుళ్లమ్మవారి జాతర ఏర్పాట్లను ఎస్పీ రవిప్రకాష్ గురువారం పరిశీలించారు. భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తరువాత మొదటిసారిగా మావుళ్లమ్మ జాతర జరుగుతుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని ఎస్పీ తెలిపారు. ఆయన వెంట భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, సీఐ అడబాల శ్రీను, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.దాసు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటును ఢీకొన్న బస్సు



ఉండిలో విరిగిపోయిన రైల్వే గేటు

ఉండి: ఉండి రైల్వే గేటును గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో విరిగిపోయింది. ఉండి నుంచి ఆకివీడు వైపు వెళ్తున్న బస్సు గేటు వేస్తునసయమంలో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో గేటు విరిగిపోయి సుమారు 45 నిముషాలపాటు ట్రాఫిక్ జాం అయ్యింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అత్యవసర గేట్ వేసి రైళ్ల రాకపోకలకు ఆటంకం లేకుండా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం



జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో హెచ్‌సీ జె.మోషేను పరామర్శిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణకు ఆటంకం కలిగించడమే కాకుండా హెడ్‌కానిస్టేబుల్‌పై పెట్రోల్ పోసి హత్య చేసేందుకు ప్రయత్నించిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక వికాస్ స్కూల్ గ్రౌండ్‌లో బుధవారం రాత్రి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. రాత్రి 11 గంటల వరకు డీజే ఏర్పాటు చేసి భారీ శబ్దాలతో స్థానికులకు ఇబ్బంది కలిగించేలా కార్యక్రమం నిర్వహించారు. సమయం మించినందున ఎస్సై ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.మోషే డీజే తొలగించి కార్యక్రమాన్ని ఆపాలని చెప్పగా అందుకు అంగీకరించలేదు. రోడ్డుకు ఇరువైపులా మోటార్‌సైకిళ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. విద్యాసంస్థల డైరెక్టర్ ఊరకరణం జగన్నాథరావు (వికాస్ జగన్) హెడ్ కానిస్టేబుల్‌ను హెచ్చరించారు. పోలీసులు అటువైపు వస్తే చంపుతానని బెదిరించాడు. విషయాన్ని ఎస్సైకు చెప్పగా.. ఆయన సిబ్బందిని తీసుకువెళ్లి కార్యక్రమాన్ని ఆపాలని చెప్పినా పట్టించుకోలేదు. వికాస్ జగన్, మరికొందరు మోషేపై దాడి చేశారు. కిందపడవేసి, కాలితో తన్ని, పెట్రోల్ పోసి అంటించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన ఎస్సై సాగర్‌బాబు సిబ్బందితో జనాన్ని చెదరగొట్టి మోషేను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించడం, హెచ్‌సీపై హత్యాయత్నానికి పాల్పడిన నేరంపై వికాస్ జగన్, చీకటి కిషోర్, ప్రత్తిపాటి శ్రావణ్‌కుమార్, కొత్తపల్లి సురేష్, కరిప్రోలు సాయి, తిరుమల ధనరాజు, చెప్పల నాగేంద్ర, తడికలరాజు, కొత్తూరు మధులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వికాస్ జగన్‌పై కిడ్నాప్ కేసు, ఎంఈవోపై దౌర్జన్యం, ఎస్సీ, ఎస్టీ కేసు తదితర 7 కేసులు నమోదైనట్లు ఎస్సై సాగర్‌బాబు తెలిపారు.

డెల్టాలో పొట్టేళ్ల పెంపకం

- స్త్రీ నిధి, ఉన్నతి పథకంలో రుణాలు
- ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీ లేని రుణాలు



పొట్టేళ్లతో డ్వాక్రా మహిళ

ఈ ఏడాది జిల్లాలో మంజూరైన యూనిట్ల వివరాలు

తాడేపల్లిగూడెం	16	పాలకొల్లు	06
పెంటపాడు	03	యలమంచిలి	11
అత్తిలి	11	నరసాపురం	04
తణుకు	07	ఆకివీడు	12
ఇరగవరం	09	కాళ్ల	05
ఆచంట	04	మొగల్తూరు	10
పెనుగొండ	04	పాలకోడేరు	03
పెనుమంట్ర	11	ఉండి	09
పోడూరు	04	వీరవాసరం	04

పాలకొల్లు అర్బన్: డెల్టా ప్రాంతంలోని డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూతకు వైఎస్సార్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంతవరకూ కొండ ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళలకు అమలు చేసిన పొట్టేళ్ల పెంపకాన్ని తొలిసారిగా డెల్టా ప్రాంతానికి విస్తరించారు. వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా వెనుకబడిన, ఇతర కులాలకు చెందిన డ్వాక్రా మహిళలకు స్త్రీ నిధి ద్వారా రూ.50 వేల రుణం అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీలేని రుణాన్ని రూ.42 వేలు ఉన్నతి పథకంలో అందిస్తున్నారు. ఈ పథకంలో నగదుకు బదులుగా ×జుడిపి× జాతి గొర్రె పిల్లలను డ్వాక్రా మహిళలకు అందిస్తున్నారు. రూ.50 వేలు రుణం తీసుకున్న వారికి 84 కిలోలు పొట్టేళ్లు, రూ.42 వేలు తీసుకున్న మహిళలకు 64 కిలోల పొట్టేళ్లు అందిస్తున్నారు. నాలుగు నెలల వయసున్న 6 నుంచి 8 పొట్టేలు డ్వాక్రా మహిళలకు అందిస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు పొట్టేళ్ల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు.

బీమా సౌకర్యం

గొర్రె పిల్ల ప్రమాదవశాత్తు, లేదా ఏదైనా రోగం వచ్చి చనిపోతే రూ.6 నుంచి రూ.10 వేల వరకు తీసుకున్న రుణంలో బీమా కింద బాకీ రద్దవుతుంది. మెడికల్ కిట్‌తో పాటు రవాణా చార్జీలు ఉచితంగా కల్పిస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు పొట్టేళ్ల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. నాటు కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపే మహిళలు పొట్టేళ్ల పెంపకానికి ముందుకు వస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 133 యూనిట్లు మంజూరయ్యాయి.



పాలకొల్లు మండలం యాళ్లవానిగరువు వద్ద డ్వాక్రా మహిళలకు అందించడానికి సిద్ధం చేసిన పొట్టేళ్లు

ఉపాధికి తోడ్పాటు



పశు పోషణ భారంగా మారింది. ఖర్చులు బాగా పెరిగిపోయాయి. ప్రత్నామ్యాయంగా గొర్రెల పెంపకంపై ఆసక్తి పెరిగింది. ఉన్నతి పథకంలో వడ్డీలేని రుణం అందించారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశ పడుతున్నా.

– బొండాద లక్ష్మి, కొత్తపేట, పాలకొల్లు మండలం

పనులు లేక పొట్టేళ్ల పెంపకం



వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నాం. ఈ ఏడాది మా ప్రాంతంలో అధిక వర్షాల వల్ల సార్వా నాట్లు వేయలేదు. దీంతో పనులు కరువయ్యాయి. పొట్టేళ్ల పెంపకంపై ఆసక్తి కలిగింది. బాడవలో పచ్చి మేత ఎక్కువగా దొరుకుతుంది. దీంతో పొట్టేళ్ల పెంపకం చేపట్టాం.

– దేవరపు అంజలీదేవి, బాడవ, యలమంచిలి మండలం

బరువు 40 కిలోలకు పైనే



సాధారణ పొట్టేళ్ల 25 కిలోలు మించి పెరగవు. జుడిపి జాతి పొట్టేళ్లు మేత లభ్యతను బట్టి 40 నుంచి 50 కిలోల వరకు పెరుగుతాయని అధికారులు వివరించారు. లాభం వస్తుందని ఆశతో రుణం పొందాను. ప్రభుత్వం బీమా సౌకర్యం కూడా కల్పించింది. స్త్రీ నిధి నుంచి రూ.50 వేలు రుణం తీసుకున్నా. నాకు 7 పొట్టేలు పిల్లలు ఇచ్చారు.

– పల్లి కుమారి, పోడూరు

మార్కెట్లో అమ్మకానికి పిడకలు



తాడేపల్లిగూడెంలో కిరాణా షాపులో గోవు పిడకలు అమ్ముతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భోగి నాడు మంటల్లో ఆవు పిడకలు వేస్తే మంచిదని నమ్మకం. అయితే ఇప్పుడు ఆవు పిడకలు చేసుకోవడం అనేది కష్టమైన పని. ఆవుల పెంపకం కూడా తగ్గిపోయింది. దీంతో ఆవు పిడకలతో మంట వేసుకోవాలనుకునే వారి కోసం పిడకలు షాపుల్లో, ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయి. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఈ వ్యాపారం ఊపందుకుంది. కిరాణా షాపులు, సూపర్ బజార్‌ల్లో వాటిని విక్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెంలో ఒక్కో పిడక రూపాయి చొప్పున అమ్ముతున్నారు. దండకు 20 నుంచి 30 పిడకలు ఉంటాయి. భోగి తరువాత వచ్చే రథ సప్తమి నాడు పిడకలతో మంట వేస్తారు.

క్లుప్తంగా

కోడిపందేల బరులు ధ్వంసం



సీసలిలో బరి ధ్వంసాన్ని పర్యవేక్షిస్తున్న సీఐ గీతా రామకృష్ణ

కాళ్ల: కోర్టు ఆదేశాలు మేరకు కోడిపందేలు, గుండాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు సీఐ గీతా రామకృష్ణ హెచ్చరించారు. గురువారం మండలంలోని సీసలి, జక్కరం, కోపల్లె తదితర గ్రామాల్లో కాళ్ల ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బరులను ధ్వంసం చేశారు. ప్రధానంగా సీసలి గ్రామంలో కోడిపందేల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బరిని ధ్వంసం చేసే పనులను సీఐ గీతా రామకృష్ణ పర్యవేక్షించారు. వీరి వెంట తహసీల్దార్ కృష్ణారావు, ఆర్ఐ రాఘవమూర్తిరాజు, వీఆర్వో రాజేష్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బీజేపీతో పెళ్లి.. టీడీపీతో కాపురం

- చంద్రబాబు స్క్రిప్టుతో రాణించలేవు
- పవన్‌కు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కౌంటర్



తాడేపల్లిగూడెం: బీజేపీతో పెళ్లి, టీడీపీతో కాపురం, చంద్రబాబు స్క్రిప్టుతో రాణించలేవు అంటూ పవన్ కల్యాణ్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గురువారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో యువభేరి సభలో పవన్‌కల్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై మంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవన్ ప్రసంగంపై నిప్పులు చెరిగారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పెళ్లి బీజేపీతో, కాపురం టీడీపీతో చేస్తూ మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వామి వివేకానంద జయంతి రోజున సభను ఏర్పాటుచేసి యువతకు ఇచ్చే సందేశం ఇదేనా అని ప్రశ్నించారు. సినిమా డైలాగులతో, చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టుతో ఊగిపోతూ ఆవేశంగా మాట్లాడినంత మాత్రాన ప్రజలు సహించరన్నారు. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డితో పోరాడానని చెబుతున్న పవన్ కల్యాణ్‌కు ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి కారకులైన వారి అంతు చూస్తానని జనసేన ఆవిర్భావ సభలో పవన్ చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజారాజ్యం బతికి ఉంటే తెలుగుదేశం చచ్చిపోతుందని చంద్రబాబు కుట్ర చేసి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసేంతవరకు నిద్రపోలేదన్నారు. అటువంటి చంద్రబాబును వదిలేసి, వైఎస్సార్‌సీపీతో, జగన్‌తో యుద్ధం అని ప్రకటించడం పవన్ రాజకీయ అవివేకానికి, దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీని పవన్ కల్యాణ్ ఏనాడైనా ప్రశ్నించాడా, నిలదీశాడా అని ప్రశ్నించారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అమలుచేసిన ఫీజు రీయింబర్స్‌మెంటు, ఆరోగ్యశ్రీ పథకాలను తెలుగుదేశం హయాంలో నీరుగారిస్తే పవన్ కల్యాణ్ ఏం చేశాడని మంత్రి కొట్టు నిలదీశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బకాయిలు పెట్టిన రూ.1900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంటు, రూ.800 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చడంతో పాటు, మరింత సమర్థవంతంగా ఈ రెండు పథకాలనూ అమలు చేస్తూ పేద కుటుంబాలకు విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నారనే విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలన్నారు. అసలు పవన్‌కు బుర్ర పని చేస్తోందా అని ఆయన ప్రశ్నించారు. సినిమాలో డైలాగుల మాదిరిగా 'వీడిని ఎవరికైనా చూపించండిరా బాబు' అనేది నూటికి నూరు శాతం పవన్‌కల్యాణ్‌కు వర్తిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర డెవలప్‌మెంటు బోర్డు ఏర్పాటుచేస్తానని పవన్ కల్యాణ్ అంటూ ఉంటే ఈలలు, చప్పట్లు తప్ప నాకు ఓట్లు వేస్తారని నమ్మకం లేదు అని చెప్పడం, జనసేన అధికారంలోకి వచ్చేది ఎప్పుడు, బోర్డు ఏర్పాటుచేసేది ఎప్పుడు అని మంత్రి కొట్టు ఎద్దేవా చేశారు. కోస్తాతీర ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏడు షిప్పింగ్ హార్బర్లు నిర్మిస్తోందని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. బీజేపీతో పెళ్లి చేసుకుని, తెలుగుదేశంతో కాపురం చేస్తున్న పవన్‌కు సీఎం జగన్‌ను గాని, సలహాదారు సజ్జలను గాని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. ఇప్పటికైనా పవన్ సినిమా డైలాగులు మాని, చంద్రబాబు స్క్రిప్టు చదవకుండా, వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

పట్టిసంలో మహాశివరాత్రికి పక్కా ఏర్పాట్లు

- ఫిబ్రవరి 17 నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు
- ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీరాణి
- ఏర్పాట్లపై అధికారులతో తొలి దఫా సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లను అధికార యంత్రాంగం సమన్వయంతో కలిసి పూర్తి చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.ఝాన్సీరాణి అన్నారు. పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రం రేవులో ఉత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మొదటి దఫా సమావేశం గురువారం నిర్వహించారు. ఫిబ్రవరి 18వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు లక్ష మందికి పైగా వస్తారనే అంచనాతో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలి ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు చేపట్టే పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులు చేపడుతున్న ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని, గత ఉత్సవాల్లో జరిగిన లోటు పాట్లను అధికారులు సరిచేసుకోవాలని, పునరావృతంకాకుండా చూడాలన్నారు. దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం క్యూలైన్‌లు, మంచినీటి వసతి, విద్యుత్ అలంకరణ తదితర పనులు చేపట్టనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇసుక తిన్నెలపై చలువ పందిళ్లు, చేతి పంపులు, దుస్తులు మార్చుకునే గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ అలంకరణ తదితర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీకి వచ్చే ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువగా ఉన్నాయని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షులు పాదం రాజబాబు మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో అధికారులు చేసే ఏర్పాట్లపై ప్రతి సంవత్సరం నిధులు లభ్యతపై సరైన స్పష్టత లేకుండా ఉందని, దీంతో ఏర్పాట్లు విషయంలో కొంత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక తిన్నెలపై జరిగే ఉత్సవాలకు కొన్ని ఖర్చులు దేవదాయ శాఖ నుంచి కేటాయించాలని పేర్కొన్నారు. డీఎస్పీ కె.లతాకుమారి మాట్లాడుతూ ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంట్లు ఎక్కి, దిగే చోట కూడా ప్రత్యేకమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీసీ ఎం.విజయరాజు, ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు, ఏసీ సీహెచ్ రంగారావు, సీఐ కె.విజయబాబు, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఎస్సై ఎస్.పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ సబ్బారపు శ్రీరామమూర్తి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

15న మెగా గ్రాండ్ టెస్ట్

కైకలూరు: పోలీసు కానిస్టేబుల్స్, ఎస్సై పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీయువకులకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలోని హోలీక్రాస్ స్కూల్‌లో యువభారత్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రవి గురువారం చెప్పారు. ఈ మోడల్ పరీక్షలో ఇంగ్లిషు 30 మార్కులు, రీజనింగ్ 35, అప్టిట్యూడ్ 35, జనరల్ స్టడీస్ 100 కలిపి మొత్తం 200 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో ఉత్తీర్ణులైన వారికి రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.వెయ్యి ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు నిమిత్తం రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 73866 65363 సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడల్లోనూ రాణిస్తే ఉన్నత భవిష్యత్

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- డేగాపురంలో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు దృశ్యం

భీమవరం అర్బన్: యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. యనమదుర్రు గ్రామ పంచాయతీ డేగాపురంలో గురువారం మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యువతను ప్రోత్సహించే విధంగా ఇటువంటి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరిలోనూ క్రీడా ప్రతిభ ఉంటుందని, ఇటువంటి పోటీల ద్వారా ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నిర్వాహకులు ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలును అభినందించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటుగా శరీర దారుఢ్యం చేకూరుతుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 12 జట్లు పాల్గొన్నాయని, మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం డీఎస్పీ శ్రీనాథ్, తహసీల్దార్ వై.రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్ర ప్రభు, సర్పంచ్‌లు బూరబత్తు రామ్మూర్తి, కోళ్ల బాలకృష్ణ, తిరుమాని శ్రీను, చిల్లే వెంకటేష్, రాట్నాల రామకృష్ణస్వామి, ఆరేటి పెద్దబ్బు, కేతానాబాబు, జల్లా కొండయ్య, కొప్పర్తి సత్యనారాయణ, తిరుమల విజయరామ్, తోట భోగయ్య, తిరుమాని ధనంజయరాజు, కామన నాగేశ్వరరావు, గుద్దటి వెంకట రామారావు, నాగరాజు శ్రీనివాసరాజు, గూడూరి ఓంకార్, కోటిపల్లి బాబు పాల్గొన్నారు.

దుంపగడపలో కబడ్డీ పోటీల ప్రారంభం

ఆకివీడు: కబడ్డీ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కనుమూరి ఆనంద వర్మ పిలుపునిచ్చారు. దుంపగడపలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందవర్మ మాట్లాడుతూ ఈ పోటీలకు పలు ప్రాంతాల నుంచి తొమ్మిది మహిళా జట్లు , 19 పురుష జట్లు పాల్గొంటున్నాయన్నారు. తొలిరోజు ఆయా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. యువత ఆసక్తిగా కబడీ పోటీల్ని తిలకిస్తున్నారు. కబడ్డీ జాతీయ క్రీడాకారుడు కాళ్లపాలెం వెంకటరత్నం, సర్పంచ్‌లు ముద్దే విశ్వేశ్వరరావు, గాలి సామ్రాజ్యం పాల్గొన్నారు.

స్టాంపు వెండర్లపై విజిలెన్స్ దాడులు



జంగారెడ్డిగూడెంలో స్టాంపు వెండర్ల కార్యాలయాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంపు వెండర్ల కార్యాలయాలపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. స్టాంపు పేపర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై నలుగురు స్టాంప్ వెండర్ల కార్యాలయాలపై ఈ దాడులు నిర్వహించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ అధికారులే సాధారణ వ్యక్తుల్లా వెళ్లి స్టాంపు పేపర్లు కొనుగోలు చేశారు. వారి నుంచి స్టాంపు వెండర్లు అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు వెల్లడించారు. విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, ఎస్సై నాగరాజు, విజిలెన్స్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఏజీ శ్రీధర్ దాడుల్లో పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో మహిళ మృతదేహం లభ్యం

ఏలూరు టౌన్: నగరంలోని ఎన్ఆర్‌పేట ప్రాంతంలో రైల్వే ట్రాక్ రోడ్డులోని డ్రెయిన్‌లో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికుల సమాచారంతో పోలీసులు గుర్తించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండవచ్చని, చనిపోయి రెండు రోజులు అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. హత్యకు గురైందా, లేక ఏవైనా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. నగరంలో జనసంచారం అధికంగా ఉండే ప్రాంతంలో ఇలా డ్రెయినేజీలో మహిళ మృతదేహం లభించటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ ఆదేశాల మేరకు మహిళా ఎస్ఐ జాస్మిన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఇంటింటా సంక్షేమ సంబరం



తణుకు అర్బన్: తణుకు 24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు బ్రోచర్లను అందించి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



పెనుగొండ (ఆచంట): ఆచంట వేమవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

174 మద్యం సీసాల స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



గణపవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

గణపవరం: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గణపవరం పోలీసులు గురువారం పట్టుకున్నారు. గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం జల్లికాకినాడకు చెందిన గొల్లపల్లి సురేష్, వోగిరాల శ్రీను అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి అర్ధవరం గ్రామం వద్ద కాపు కాసి మద్యం తీసుకెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 174 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై దాడి.. ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న భీమవరం రూరల్ సీఐ నాగ ప్రసాద్

వీరవాసరం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అతనికి సహకరిస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ నాగప్రసాద్ చెప్పారు. వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో సీఐ కేసు వివరాలు వెల్లడించారు. ఎస్పీ యూ.రవిప్రకాష్ ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో వీరవాసరం పోలీసులు కొణితివాడలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్న వెంకట్రాజు అనే నిర్వాహకుడిని, అతడికి సహకరిస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, కీబోర్డులు, మౌస్‌లు, సెల్‌ఫోన్లు, రూ.9750 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ వ్యవహారంలో మరో ఆరుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించామని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. వీరవాసరం ఎస్సై పి.రమేష్ పాల్గొన్నారు.

బస్సులో టాయిలెట్‌కు వెళ్లి..
ఎగ్జిట్ డోర్ తీసి !

ఏలూరు టౌన్: ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో టాయిలెట్‌కు వెళ్లిన అనంతరం పొరపాటున ఎగ్జిట్ డోర్ తీసి అడుగు బయటపెట్టిన ఓ ప్రయాణికుడు రోడ్డు మీద పడిపోవడంతో మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఆకురాతి నన్నయ్య (59) ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆయన విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో బంధువుల ఇంటికి ప్రయాణమయ్యారు. ఈ నెల 11న రాత్రి హైదరాబాద్‌లోని ఇంటర్‌సిటీ స్మార్ట్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కారు. ట్రావెల్స్ బస్సు గురువారం తెల్లవారుజామున ఏలూరు సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తోంది. నన్నయ్య కాలకృత్యాలు తీర్చుకునేందుకు బస్సు వెనుక భాగంలోని టాయిలెట్ రూములోకి వెళ్లారు. అనంతరం బయటకు వస్తూ లోపలికి వెళ్లే తలుపు అనుకుని బస్సు వెనుక భాగంలోని ఎమర్జెన్సీ ఎగ్జిట్ తలుపు తీసి ముందుకు వెళ్లటంతో ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయారు. దీంతో పెద్ద శబ్దం రాగా, డ్రైవర్ విషయాన్ని గమనించి బస్సును నిలిపివేశారు. జాతీయ రహదారి పెట్రోలింగ్ పోలీసుల సహకారంతో నన్నయ్యను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రావెల్స్ యాజమాన్యం బస్సులో ప్రయాణించే వారికి ఎగ్జిట్ డోర్‌పై అవగాహన కల్పించాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని అంటున్నారు.

జాలిపూడిలో ఎడ్లబండ్ల పోటీలు ప్రారంభం

ఏలూరు రూరల్: సంక్రాంతి సందర్భంగా ఏలూరు మండలం జాలిపూడిలో ఎడ్ల బండ్ల పోటీలను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, యువతీ, యువకులను ఉత్సాహపరిచేందుకు ఏటా వైఎస్సార్ సీపీ నాయకులు ఈ పోటీలను నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలకు చాటపర్రు, జాలిపూడి, తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం తదితర గ్రామాల నుంచి రైతులు ఎడ్లబండ్లతో తరలివచ్చారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో గెలిచిన వారికి నగదు బహుమతి అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజుతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేపరు ప్రకటన

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మున్సిపల్ లిమిట్స్‌లోని 26వ వార్డు సోమేశ్వర అగ్రహారం కాపురస్తులు వెండుకూరి శ్రీకృష్ణంరాజు గారి కుమారుడు వెంకట సుబ్బరాజు ... పాలకొల్లు మండలం పూలపల్లి శివారు భగ్గేశ్వరం గ్రామంలోని రెవిన్యూ సర్వే నెంబర్లు 17/13,17/14,17/15, 17/19,17/17,17/18,16/10,16/18,17/6 లలో మొత్తం ఎ. 1-76 3/4 సెంట్లు ... నెం.1-22 గల ... సుమారు 40 సంవత్సరములు పైబడి సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో తన స్వాధీనంలో అనుభవించుచున్నారు. ... [illegible] ... 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఓ.ఎస్.నెం. 2/2023 ... ఇ.ఏ. నెం.16/2023న పిటీషన్ దాఖలు చేసియున్నారు. అందుపై శ్రీ కోర్టువారు అర్జంట్ నోటీసు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. ... [illegible] ... ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

కే. వరసింహం, బి.ఎస్సీ., బి.యల్, పిటీషనర్ తరఫు అడ్వకేట్
శ్రీరాంపురం, భీమవరం-2. సెల్: 98491-21863
భీమవరం
ది.12-01-2023

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc No.E1/2422/2022-23 Dated : 12.01.2023

S. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs.in lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	CC Pot Holes (Civil Works)-12 Nos	General Funds	49.94	14.01.2023 11.00AM	30-01-2023 4.00 PM

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in

B.BALA SWAMY, M.A.,
Commissioner
Tadepalligudem Municipality

క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కృపావరం



మంత్రి కొట్టు సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృపావరం

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం మండల సేవా దళ్ చైర్మన్‌గా కొండుబోయిన కృపావరం నియమితులైన విషయం పాఠకులకు విదితమే. ఈ సందర్భంగా గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కృపావరం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని కృపావరం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులురెడ్డి), మారిశెట్టి వెంకటేశ్వరరెడ్డి, మారిశెట్టి సూరిబాబు, చుంద్రు శ్రీనివాస్, కొండుబోయిన ఏసు టోనీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



నందమూరు పంచాయతీ వద్ద సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శనగన వరలక్ష్మి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ శనగన వరలక్ష్మి గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి, పారిశుద్ధ్యం విషయంలో పంచాయతీ సిబ్బంది సహకారం అవసరమన్నారు. ప్రజలు కూడా గ్రామ పారిశుద్ధ్యానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈశ్వరి, నాయకులు శనగన రాంబాబు, శివ, పవన్, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ 2023ను గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి బీఎస్ స్మైల్స్, చంద్రరావు, కిరణ్, సువర్ణరాజు, ఆఫీస్ సూపరింటెండెంట్ బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: నీటిని పొదుపుగా వాడుకుంటూ భావితరాలకు వాటిని అందించాలని జల్ జీవన్ మిషన్ టీమ్ లీడర్ చైతన్య ప్రదీప్ అన్నారు. జల్ జీవన్ మిషన్‌పై గురువారం మండలంలోని పుల్లాయగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యప్రదీప్ మాట్లాడుతూ ప్రతి మనిషికి రోజు వారీ 55 లీటర్ల మంచినీటిని అందించాలనే దిశగా పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాన్ని ప్రజలు ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చుంద్రు శ్రీనివాస్, ఎలిపే గాంధీ, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు మేలైన సేవలు అందించాలి



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసిన నూతన వ్యవసాయ సలహామండలి సభ్యులు

పెంటపాడు: వ్యవసాయ సలహామండలి సభ్యులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయ ఉన్నతికి సీఎం జగనన్న ఆశయాలు నెరవేర్చాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, సభ్యులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కనుకు పుల్లయ్య, గుండుమోగుల మునీంద్ర, జాలపర్తి నాగేశ్వరరావు, బుద్దన ప్రసాద్, గోడి అనంతలక్ష్మి, తాడి నాగబాస్కరరావు తదితరులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కడియద్ద గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, వలంటీర్లపై ఉందని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించవలసి ఉండగా, అనివార్య కారణాలతో మంత్రి రావడం ఆలస్యమైంది. అయితే, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో సంక్షేమ పథకాల అమలు, సమస్యలపై మంత్రి చర్చించారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి మాట రాకుండా అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి, వారికి ఏ కారణాలతో సంక్షేమ పథకాలు ఆగాయో పరిశీలించి లబ్ధి చేకూర్చాలన్నారు. అనంతరం ఆయన విజయవాడ బయల్దేరి వెళ్లారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, గ్రామసర్పంచ్ యాతం కోటీశ్వరి, ఎంపీటీసీలు దారపురెడ్డి దుర్గాదేవి, నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెద్దబ్బులు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, యాతం బూరయ్య, కొండుబోయిన కృపావరం, పాకనాటి తాతాజీ, చిక్కాల సత్యనారాయణ, జడ్డు హరిబాబు, దారపురెడ్డి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ఈ నెల 18వ తేది సాయంత్రం 4 గంటలకు కడియద్ద గ్రామంలో తిరిగి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెలిశెట్టి నరేంద్రకుమార్ తెలిపారు.



కడియద్ద గ్రామంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

నానో యూరియా, డీఏపీలపై రైతులకు అవగాహన అవసరం

తణుకు టౌన్: రైతులు తమ వ్యవసాయ పంటల సాగులో నానో యూరియా, నానో డీఏపీల వినియోగం పట్ల అవగాహన కలిగి వుండాలని ఇఫ్కో సంస్థ జనరల్ మేనేజర్ ఎం.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామ సొసైటీ ఆధ్వర్యంలో ఎరువుల సంస్థ ఇఫ్కో నానో యూరియా, డీఏపీ ఎరువుల వాడకంపై రైతులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ పంటలపై నానో యూరియా, నానో డీఏపీలను ఎలా వాడాలో రైతులకు వివరించారు. సొసైటీ అధ్యక్షుడు కృష్ణంరాజు మాట్లాడుతూ రబీ పంట సాగు కాలంలో రైతులకు కావలసిన ఎరువులను సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, సంఘ డైరెక్టర్లు కాపకాయల వరప్రసాద్, రైతు బంధు అధ్యక్షుడు దండు గోపాల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

యల్లాప్రగడను స్ఫూర్తిగా తీసుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్: శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావును నేటియువత స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. యల్లాప్రగడ సుబ్బారావు జయంతి కార్యక్రమాన్ని పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ యల్లాప్రగడ మన ప్రాంతం వాడు కావడం మన జాతికి గర్వకారణమన్నారు. యల్లాప్రగడ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే విద్యాశాఖ అధికారులతో మాట్లాడి 7వ తరగతిలో పాఠ్యాంశంగా చేర్చారన్నారు. దీనికి జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పేదరికం అనుభవిస్తూ విద్యపట్ల మక్కువతో మిత్రులు, శ్రేయోభిలాషులు సహకారంతో శాస్త్రవేత్తగా ఎదిగిన సుబ్బారావు జీవితాన్ని మనందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేటికి ఆయన కొనగొన్న ఔషదాలను ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు వీబీటి రాజు, లీలావతి, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్లలో గురువారం వైద్యాధికారి డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో వెక్టార్ కంట్రోల్ హైజిన్, డ్రై డే కార్యక్రమాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి కీటక నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. అపరిశుభ్రత వాతావరణం ఉన్నచోట అనంతరం గృహ సందర్శనాలు చేసి దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు ప్రబలవన్నారు. ఎక్కడ మురుగు నీరు నిలవ లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి వరూనిక, ఆరోగ్య సహాయకులు కాంతారావు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో మలేరియా డిపార్ట్‌మెంట్ వారిచే అవగాహన ర్యాలీ దృశ్యం

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్రాహ్మణ సేవా పరిషత్తు ఆధ్వర్యంలో పెదతాడేపల్లి గాయిత్రి బ్రాహ్మణ కల్యాణ మండపంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముగ్గుల పోటీలు, వంటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు పుల్లభొట్ల వెంకట సూర్యనారాయణమూర్తి, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గరికిపాటి బాపయ్య శర్మ, కలిగొట్ల శ్రీనివాస్, ఆర్.రాజా, కొలచన ఆత్మారాం, లక్ష్మి, కనకదుర్గ, లలిత, కృష్ణవేణి, మహతి, శైలజ, శ్రీజ, సీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

తణుకు టౌన్: సంక్రాంతి సందర్భంగా తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. గురువారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం వద్ద పీబీఆర్ గ్రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమళ్ల ఫణీంద్ర, పట్టణ మహిళా అధ్యక్షురాలు కనక దుర్గ, ఎంపీటీసీలు చుంద్రు శ్యామల, విజయ దుర్గ, రెడ్డి హైమా, కనక దుర్గ, కత్తుల జస్పాల్ పాల్గొన్నారు.

దువ్వలో.. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ నాయకుడు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పంచాయితీ సభ్యులు పాల్గొన్నారు.

తేతలిలో.. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని ఏఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, స్టెప్పింగ్‌స్టోన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు...

సంక్రాంతి సందర్భంగా యువత జూదాలకు దూరంగా వుండాలనే లక్ష్యంతో తేతలి గ్రామ సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, నాయకులు సరెళ్ల సతీష్, కృపావరం ఆధ్వర్యంలో యువతకు కబడ్డీ పోటీలను నిర్వహించారు.

వివేకానందుని బోధనలు యువతకు ఆదర్శం

తాడేపల్లిగూడెం: స్వామి వివేకానంద సూక్తులు, బోధనలు నేటి యువతకు ఆదర్శమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అన్నారు. గురువారం ఏపీ నిట్ పాలనాభవనంలో జాతీయ యువజన దినోత్సవం పేరిట వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరెడ్డి మాట్లాడుతూ లేవండి, మేల్కొనండి, గమ్యం చేరే వరకు శ్రమించాలని యువజనుల్లో చైతన్యదీప్తిని రగిల్చిన మహోన్నతి వ్యక్తి వివేకానంద అన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ,సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. యువత వివేకానందుని అడుగుజాడల్లో నడిచి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ.వీరేష్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డా.వి.సందీప్, ఆర్.శ్రీనివాసన్, డా. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్వామి అడుగుజాడలలో నడుద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎస్‌వీ రంగారావు విగ్రహం సర్కిల్ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో యువతచే రన్ ఫర్ యువ అనే ర్యాలీ నిర్వహించారు. పోలీస్ ఐలాండ్ వద్ద వివేకానంద విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చ పట్టణ అధ్యక్షుడు గరగా ప్రసాద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, లీలాకష్ణ, సింగం జగపతి రామయ్య, అయినం బాలకష్ణ, దత్తు ప్రసాద్, తదితరుల పాల్గొన్నారు.

వివేకానంద సేవా సంఘం వారిచే...

పట్టణంలో గురువారం వివేకానంద సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ఆర్‌కే వర్మ ఆధ్వర్యంలో సుబ్బారావుపేటలో వివేకానంద 161వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ యువత వివేకానంద స్వామి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్పల రామకష్ణంరాజు, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పేరిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపకలు మురళీకష్ణంరాజు, తాతా శ్రీనివాస్, గురజాడ ఆనంద్‌కుమార్, బత్తుల ప్రసాద్, విశ్వంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏపీ నిట్‌లో వివేకానంద జయంతి



బల్లిపాడులో వివేకానందస్వామి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

పాతూరు యూత్ ఆధ్వర్యంలో...

అదే విధంగా పాతూరు నాయకులు దాట్ల జగన్నాధరాజు ఆధ్వర్యంలో నిమ్మకాయల యూత్ వారిచే వివేకానంద స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్.సత్యనారాయణ, గొర్ల మహారాజ్, నార్ని చిన్నా, యాదల శివాజీ, నీలం సురేష్, సాయి కష్ణ, సతీష్, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

యువత స్వామివివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

అత్తిలి: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని రీడర్స్‌ఫోరం అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాస్ అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు శ్రీమదనగోపాలస్వామివారి అనుబంధ గ్రంథాలయంలో చదువరుల సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దిరిశాల శ్రీనివాస్, కార్యదర్శి యర్రంశెట్టి శివన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్లు రోడ్డులో ఉమర్ ఆలీషా పీఠం వద్ద వివేకానంద జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యవతి నగర్ చెట్లు రోడ్డులో పిఠాపురం డా.ఉమర్ ఆలీషా పీఠం శాఖ వద్ద గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో కరిబండి రామకృష్ణ, గ్రంధి శ్రీనివాస వర ప్రసాద్, మద్దుల గుప్త, సుభద్ర, బాలగోపాల్, రామాంజనేయ రాజు దంపతులు, శ్రీనివాస్, సుజాత, స్వర్ణకుమారి, యోగా సభ్యులు పాల్గొన్నారు.



వివేకానంద స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

యువజనోత్సవ విజేతలకు బహుమతులు ప్రదానం

తణుకు టౌన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా జిల్లా సెట్‌వెల్ , ఏపీ యువజన సేవా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిద పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసినట్లు తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏపీ సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, ఏవో కె జాన్ కెనడీ, ఎస్ పట్టాబీరామ్, పీ శివ ప్రసాద్, పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా తణుకు బ్యాంక్‌కాలనీలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుఅర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్‌చౌదరి, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి అర్జి భాస్కరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలే ముద్దు

పెంటపాడు: సంక్రాంతి సంబరాల్లో సంప్రదాయ క్రీడలే ఎంతో ముద్దు అని పెంటపాడు తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, గూడెంటౌన్, రూరల్ సీఐలు నాగరాజు, మూర్తిలు పేర్కొన్నారు. పెంటపాడు ఎస్టీపీఎస్ హిందూ హైస్కూల్లో గురువారం నుంచి పెంటపాడు పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చట్టవ్యతిరేకమైన జూదాలు, బెట్టింగ్‌లు, కోడిపందేలు, పేకాటలను విస్మరించాలన్నారు. ఆరోగ్యాన్ని, మనో వికాశాన్ని పెంచేందుకు యువత, విద్యార్థులు పలు క్రీడల పట్ల మక్కువ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, తోట నిరీక్షణరావు, దేవాబత్తుల నాగమణి బాబి, కోసూరి సుబ్బరాజు, తాడేపల్లి ఈశ్వరరావు, పార్టీ నాయకులు బర్ల జయరాంబాబు, గుండుమోగుల మునీంద్ర, గోకా వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గాభవాని, ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ, ఎస్సైలు జి. సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఇరగవరం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ పొట్ల సురేష్ తెలిపారు. మండలంలోని ఇరగవరం గ్రామంలో సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మేలు చేస్తున్నారని తెలిపారు. అందరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నిరంతరం ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంతలా రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన ముఖ్యమంత్రి చరిత్రలో ఎక్కడా లేరని అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అందరివాడిగా అందరి యోగక్షేమాల కోసం ఆలోచిస్తూ, వారి అవసరాలను తీరుస్తూ, తణుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చోడే జోషి, చేబ్రోలు పెద్దిరాజు, బొల్లా ఆనందం, వసంతగిరీష్, గోడి దినేష్, రాజశేఖర్, రేలంగి సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, పాల్గొన్నారు.



ఇరగవరంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సమావేశంలో మాట్లాడుతున్నా నాయకులు

రావిపాడు సొసైటీ మాజీ చైర్మన్ రాము మృతి

పెంటపాడు: రావిపాడు సొసైటీ త్రిసభ్యకమిటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు కోటగిరి రాము (65) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలుసుకొన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, యువనేత కొట్టు విశాల్‌లు సంతాపం వ్యక్తం చేసారు. స్థానిక సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు తాతారావు, పార్టీ నాయకులు వింజమూరి శ్రీనివాస్ తదితరులు రాము మృతికి సంతాపం వ్యక్తం చేసారు.

ప్రజాసాధికారతే లక్ష్యంగా పథకాల అమలు

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- 24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

తణుకు అర్బన్: ప్రజాసాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని పారదర్శకంగా అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు.తణుకు 24వ వార్డు అవినాష్ అపార్టుమెంట్ నుంచి గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ ప్రభుత్వం మళ్లీ రావాలని ప్రజానీకం ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. అత్యంత పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమానికి ప్రజలు పూర్తి మద్దతు తెలుపుతున్నారని అన్నారు. ప్రతి గడపలోను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ సొంత బిడ్డలా ఆదరిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా చూసి సృష్టించబడిన సంక్షేమం ప్రజలందరి ఆదరణ పొందుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజానీకం మంత్రి కారుమూరి దృష్టికి తీసుకురాగా తక్షణమే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు, తహసీల్దారు పీఎన్‌డీ ప్రసాద్, మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఆకుల కిరణ్, పట్టణ యూత్ అధ్యక్షులు చేశెట్టి లలిత శంకర్, కర్రి కాశీరెడ్డి, బండి సతీష్, గంటా ప్రసాద్, ఖాజామొహిద్దీన్, సప్పా సత్యనారాయణ, ఈగల సత్య నారాయణ, కర్రి గంగాధర అప్పారావు పాల్గొన్నారు.



తణుకులో టీడీపీ నాయకులకు పార్టీ కండువా కప్పిన మంత్రి కారుమూరి

సంక్షేమపాలనతోనే పార్టీలో చేరికలు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాన్ని చూసి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం దంతుపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కుక్కల శ్రీనివాస్ వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ టీడీపీ నుంచి ఇటీవల కాలంలో అధికసంఖ్యలో ముఖ్య నేతలు వైఎస్సార్‌సీపీలోకి చేరుతుండడం విశేషమన్నారు. పార్టీలోచేరిన కుక్కల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి టీడీపీలో ఉంటూ గ్రామ అధ్యక్షుడిగా ఉండి కూడా తనకు ఎటువంటి ఉపకారం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ తనకు అందుతున్నాయని అదే స్ఫూర్తితో నేను వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. ముందుగా పార్టీలో చేరిన టీడీపీ నాయకులు కుక్కల ఆదినారాయణ, జుత్తిగ వీరాంజనేయులు, బొక్కా నాగేశ్వరరావు, గుత్తుల వెంకట సత్యనారాయణలకు మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పారు. కార్యక్రమంలో దంతుపల్లి గ్రామ సర్పంచ్ శీలబోయిన ప్రసాద్, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, వెలగల అమ్మిరెడ్డి, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.